# ఈ నెల విశేషాలు

సత్యనరసింహశర్మ

## భద్రములనిచ్చే భాద్రపదం

బుధవారం(01.09.2021), శ్రావణ బహుళ దశమి నుండి గురువారం(30.09.2021), భాద్రపద బహుళ నవమి వరకు

**02.09.2021 – గురువారం – గురుఏకాదశి – అలభ్యయోగం**

గురువారం ఏకాదశి కలిసిరావడం అలభ్యయోగంగా చెప్పబడింది. ఈ రోజు ఆచరించిన ఏ చిన్నిపాటి పుణ్యకర్మ అయినా అక్షయమైన ఫలితాలను కలుగజేస్తుంది.

**03.09.2021 – శుక్రవారం – అజ ఏకాదశి**

ఈ రోజున నారాయణుని **“జనార్దన”** నామంతో పూజించి ఏకాదశీవ్రతాన్ని ఆచరించాలి.

**04.09.2021 – శనివారం – శనిత్రయోదశి**

శంకరప్రీతికరమైన శ్రావణమాసంలో వచ్చే శనిత్రయోదశినాడు నియమపాలన ద్వారా ఈశ్వరానుగ్రహం కలిగి శనిదోషం పరిహారమవుతుంది.

**05.09.2021 – ఆదివారం – మాస శివరాత్రి**

శివునికి ప్రీతికరమైన ఈ మాసంలో వచ్చే మాసశివరాత్రి వ్రతాన్ని ఆచరించడం విశేష ఫలితాన్నిస్తుంది.

**06.09.2021 – సోమవారం – కుశగ్రహణం, పోలావ్రతం**

పవిత్రమైన దర్భ(కుశ)లను సేకరించడానికి ఈ రోజు అత్యంత ఉత్కృష్ట దివసమని శాస్త్రవచనం.

## ప్రధానమైన పండుగలు

సెప్టెంబర్

**02.09.2021** – గురువారం – గురుఏకాదశి – అలభ్యయోగం
**03.09.2021** – శుక్రవారం – అజ ఏకాదశి
**04.09.2021** – శనివారం – శనిత్రయోదశి
**05.09.2021** – ఆదివారం – మాస శివరాత్రి
**06.09.2021** – సోమవారం – కుశగ్రహణం, పోలావ్రతం

భాద్రపదం మాసం

**08.09.2021** – బుధవారం – కల్కి జయంతి, చంద్ర దర్శనం
**09.09.2021** – గురువారం– బలరామ జయంతి, 16 కుడుముల తద్ది(షోడశోమా వ్రతం), సువర్ణగౌరీవ్రతం, హరితాళికా వ్రతం
**10.09.2021** – శుక్రవారం – వినాయక చవితి, అగస్త్యార్ఘ్యం, మహాచతుర్థీనామ అలభ్యయోగం
**11.09.2021** – శనివారం – ఋషిపంచమి
**12.09.2021** – ఆదివారం – సూర్యషష్ఠి, స్కందదర్శనం
**13.09.2021** – సోమవారం – ఆముక్తాభరణ సంతాన సప్తమీవ్రతం
**14.09.2021** – మంగళవారం – దూర్వాష్టమి, రాధాష్టమి
**15.09.2021** – బుధవారం – నందనవమి
**16.09.2021** – గురువారం – క్షీరవ్రతారంభం, కేదార వ్రతం
**17.09.2021** – శుక్రవారం – పరివర్తన ఏకాదశి, దాన ఏకాదశి, విష్ణుశృంఖలనామ అలభ్య పుణ్యకాలం, వామన జయంతి
**18.09.2021** – శనివారం – శనిత్రయోదశి
**19.09.2021** – ఆదివారం – అనంతపద్మనాభస్వామి వ్రతం
**20.09.2021** – సోమవారం – ఉమామహేశ్వర వ్రతం, ఉపాంగలలితాగౌరీ వ్రతం
**21.09.2021** – మంగళవారం – మహాలయపక్ష ప్రారంభం
**23.09.2021** – గురువారం – ఉండ్రాళ్ళ తదియ
**24.09.2021** – శుక్రవారం – సంకష్టహర చతుర్థి వ్రతం, భరణి మహాలయం
**28.09.2021** – మంగళవారం – వ్యతీపాత మహాలయం
**29.09.2021** – బుధవారం – బుధాష్టమి, ఆర్ద్రాష్టమి
**30.09.2021** – గురువారం – అవిధవ నవమి

అంధకాసుర సంహారంలో నంది ప్రకటించిన ప్రతాపానికి సంతోషించి పరమేశ్వరుడు "పోల" అనే బిరుదును ఇచ్చి శ్రావణ అమావాస్య నాడు ఆవులతో కలిసిన వృషభములను పూజింపవలెనని నిర్ణయించడం వల్ల దీనికి "పోలా వ్రతం" అని పేరు వచ్చింది. ఈ రోజున గోవులతో కూడిన వృషభములను వస్త్రాభరణాదులతో పూజించి ఆహారము పెట్టి ప్రార్థించాలి.

## భాద్రపద మాసం

**08.09.2021 - బుధవారం - కల్కి జయంతి, చంద్ర దర్శనం**

ఈ రోజున నారాయణుని అశ్వారూఢుడైన కల్కి అవతారునిగా భావించి విష్ణుసహస్రనామాదులతో అర్చించాలి.

**09.09.2021 - గురువారం- బలరామ జయంతి, 16 కుడుముల తద్ది(షోడశోమా వ్రతం), సువర్ణగౌరీవ్రతం, హరితాళికా వ్రతం**

గౌరీదేవిని పూజించి 16 కుడుములు నైవేద్యముగా పెట్టి, వ్రతకథను చదువుకుని, కుడుములు, లక్కజోళ్ళు, నల్లపూసలు, దక్షిణ తాంబూలాలతో 16 చేటలలో పెట్టి 16 మంది ముత్తైదువులకు వాయనమివ్వాలి. ఇది కాక హరితాళికావ్రతమనేది శాస్త్రమునందు చెప్పబడినది కూడా ఆచరించవచ్చును.

**10.09.2021 - శుక్రవారం - వినాయక చవితి, అగస్త్యార్ఘ్యం, మహాచతుర్థీనామ అలభ్యయోగం**

తొలిపూజలందుకునే ఆదిపరబ్రహ్మ స్వరూపుడైన గణపతిని



సిద్ధివినాయకునిగా మట్టితో చేసిన విగ్రహమునందు ఆవహింపజేసి వ్రత విధాన ప్రకారముగా పూజించాలి.

అగస్త్యార్ఘ్యం అనే వ్రతపాలన ఋషిఋణం తీర్చుకోవడానికి ఒక మహదవకాశం. ఈ వ్రతానికి ఏడు రోజుల ముందు నుండి అగస్త్యునికి అర్ఘ్యప్రదానం చెయ్యాలి.

**11.09.2021 - శనివారం - ఋషిపంచమి**

బహిష్టులు ఆగిన స్త్రీలు అప్పటివరకు తెలిసీతెలియక చేసిన దోషాలు తొలగడానికి సప్తర్షులను సపత్నీకంగా అర్చించాలి. ఇతరులు సప్తర్షులను తలచుకుని నమస్కరించాలి. ఈ రోజున అరటిపళ్ళు, నెయ్యి, పంచదార సదక్షిణంగా దానం చెయ్యాలి.

**12.09.2021 - ఆదివారం - సూర్యషష్ఠి, స్కందదర్శనం**



**"శుక్లభాద్రపదే షష్ఠ్యాం స్నానం భాస్కర పూజనం, ప్రాశనం పంచగవ్యస్య చాఽశ్వమేధ ఫలాదికం"** - సూర్యోదయాత్పూర్వం సంకల్పపూర్వకంగా స్నానమాచరించి, సూర్యుని పూజించి, పంచగవ్య ప్రాశన చెయ్యాలి. దానివలన అనేక యజ్ఞములు చేసిన ఫలితం వస్తుంది. ఈ రోజున సుబ్రహ్మణ్యస్వామిని కూడా అర్చించాలి.

**13.09.2021 - సోమవారం - ఆముక్తాభరణ సంతాన సప్తమీవ్రతం**

సంతాన ప్రాప్తికి, సంతాన క్షేమం కొరకు ఈ వ్రతాన్ని ఆచరించాలి. దీనిని ఆచరించేవారు, పగలంతా ఉపవసించి, సాయంత్రం గౌరీపరమేశ్వరులను గంధము, పుష్ప, ధూప, దీప, నైవేద్యాదులతో ఆరాధించాలి. ఆవుపాలు, బెల్లముతో వండిన పిండివంటలు నైవేద్యముగా పెట్టి తాంబూలమును కూడా సమర్పించాలి. పూజా సమయంలో ఒక ఎర్రని రంగులోనున్న తోరమును దేవుని వద్దనుంచి పూజించి, వ్రతము

పూర్తయ్యాక దానిని తీసి ధరించాలి.

**14.09.2021 - మంగళవారం - దూర్వాష్టమి, రాధాష్టమి**

దూర్వాలతో గణపతిని పూజించడం శ్రేయస్కరం.



దేవీభాగవతము ప్రకారము పరాశక్తి ప్రధాన రూపాలైన శ్రీ రాధాదేవి, గౌరీదేవతలను పూజించాలి. ఏడు రకముల పువ్వులు, ఏడు రకముల పండ్లను నైవేద్యముగా పెట్టి పూజించడం వల్ల ఆ కుటుంబములో సుఖ శాంతులు వర్ధిల్లుతాయి.

**16.09.2021 - గురువారం - క్షీరవ్రతారంభం, కేదార వ్రతం**

చాతుర్మాస్యవ్రతంలో భాగంగా రెండవ మాసవ్రతారంభం ఈ రోజు చెయ్యాలి. ఈ రోజు నుండి నెల రోజులు పాలను స్వీకరించరాదు. దానికి ఈ విధంగా సంకల్పించాలి.

**క్షీరవ్రతమిదం దేవ! గృహీతం పురతస్తవ, నిర్విఘ్నం సిద్ధిమాయాతు ప్రసాదాత్తవ రమాపతే!**

ఈ మాసవ్రతం పూర్తయ్యాక(ఆశ్వయుజ శుద్ధ ఏకాదశినాడు) ఈ విధంగా సమర్పించాలి–

**ప్రద్యుమ్న తే నమస్తుభ్యం మాసమారభ్య యత్కృతం, ఇష్టదో భవ సర్వేశ! గృహీత్వాతు పయోవ్రతం.**

ఈ రోజున విధి విధానముగా కేదారవ్రతము ఆచరిచడం వ్రతసిద్ధిని కలుగజేస్తుంది.

**17.09.2021 - శుక్రవారం - పరివర్తన ఏకాదశి, దాన ఏకాదశి, విష్ణుశృంఖలనామ అలభ్య పుణ్యకాలం, వామన జయంతి**

ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు యోగనిద్రకు ఉపక్రమించిన నారాయణుడు ఈ రోజున ప్రక్కకు ఒత్తిగిలుతాడు కాబట్టి దీనికి పరివర్తన ఏకాదశిగా వ్రతాన్ని ఆచరించాలి. చాతుర్మాస్యాలలో ఇది మధ్య రోజు. సంధ్యాసమయంలో విష్ణువును పూజించి **"వాసుదేవ జగన్నాథ ప్రాప్తేయం ద్వాదశీ తవ, పార్శ్వేన పరివర్తస్య సుఖం స్వపిహి మాధవ"** అనే శ్లోకముతో ప్రార్థించాలి.

ద్వాదశి తిథి, శ్రవణ నక్షత్రం కలిసిన రోజు వామన జయంతి. వామనుని పూజించిన తరువాత ఈ క్రింది శ్లోకముతో అర్ఘ్యమివ్వాలి. **"దేవేశ్వరాయ దేవాయ దేవసంభూతి కారిణే, ప్రభవే సర్వదేవానాం వామనాయ నమో నమః." "నమస్తే పద్మనాభాయ నమస్తే జలశాయినే, తుభ్యమర్ఘ్యం ప్రదాస్యామి బాలవామనరూపిణే".** ఈ రోజున పెరుగును దానం చేయడం పుణ్యప్రదం.



**19.09.2021 - ఆదివారం - అనంతపద్మనాభస్వామి వ్రతం**

శేషతల్పశాయిగా నాభికమలంలో బ్రహ్మ కొలువై ఉండగా, మహాలక్ష్మీ సమేతుడైన అనంతపద్మనాభుని పూజించే వ్రత

విధానము. కొన్ని ప్రాంతాలలో వరిపిండితో/పసుపుతో ఏడు పడగల ఆదిశేషుని చిత్రించి పూజించే ఆచారం కూడా ఉంది. ఈ వ్రతంలో కలశలోని నీటిలో యమునను ఆవాహన చేసి, 24 ముడులున్న తోరములను పెట్టి పూజించిన తరువాత, భార్యాభర్తలిరువురు ఈ శ్లోకమును చెప్తూ, భార్య భర్త కుడి చేతికి, భర్త భార్య ఎడమ చేతికి కట్టాలి. **"దారిద్ర్య నాశనార్థాయ పుత్ర పౌత్ర ప్రవృద్ధయే, అనంతాఖ్యమిదం సూత్రం ధారయామ్యహముత్తమం".**

**20.09.2021 – సోమవారం – ఉమామహేశ్వర వ్రతం, ఉపాంగలలితాగౌరీ వ్రతం**



మాసముయొక్క సంపూర్ణ శక్తి నెలకొన్న ఈ పూర్ణిమ నాడు ఉమామహేశ్వర వ్రతాన్ని ఆచరించే విధానాన్ని శివుడు పార్వతితో చెప్పాడు. ఈ వ్రతం చేసేవారు 15 వరుసలు, 15 ముడులతోనున్న తోరమును చేసి ఉమామహేశ్వరులను పూజించిన తరువాత కట్టుకోవాలి. గోధుమపిండితో తయారైన 15 రకముల పిండివంటలను నైవేద్యంగా సమర్పించాలి. పరివార దేవతలతో కూడిన లలితాదేవిని పూజించే వ్రత విధానం కూడా శాస్త్రంలో చెప్పబడింది.

**21.09.2021 – మంగళవారం – మహాలయపక్ష ప్రారంభం**

ఈ రోజునుండి 15 రోజులపాటు పితృపక్షమైన మహాలయ పక్షం. **"మహత్ అలం యాత్ ఇతి మహాలయః".** "చాలినంత తృప్తి"ని పితరులు ఈ పక్షంలో తమ పుత్రులు చేసిన తర్పణాదుల ద్వారా పొందుతారు కనుక దీనికి "మహాలయం" అని పేరు. యథాశక్తి పితృశ్రాద్ధాన్ని చెయ్యాలి. ఈ 15 రోజులలో ప్రతిరోజూ చెయ్యలేని వారు, కనీసం ఒక్కరోజైనా చెయ్యాలి.

**23.09.2021 – గురువారం – ఉండ్రాళ్ళ తదియ**

ఈ నోముకు మోదక తృతీయ అనే పేరు కూడా ఉంది. స్త్రీలు సాయంత్రం వరకు ఉపవాసంతో ఉండి, గౌరీదేవిని షోడశోపచారాలతో పూజించి, అయిదు ఉండ్రాళ్ళు నైవేద్యంగా పెట్టి, మరొక అయిదు ఉండ్రాళ్ళు అయిదుగురు ముత్తైదువులకు వాయనమివ్వాలి. ఇలా అయిదు సంవత్సరాలు చేసి ఉద్యాపన కూడా చేసుకోవాలి. కన్యలు దీనిని ఆచరించడం వల్ల ఉత్తమమైనవానితో వివాహం జరుగుతుంది. వివాహమైనవారు ఆచరించడం వల్ల దీర్ఘసుమంగళిగా వర్ధిల్లుతారు.

**24.09.2021 – శుక్రవారం – సంకష్టహర చతుర్థి వ్రతం, భరణి మహాలయం**

ఈ రోజు నియమానుసారం సంకష్టహర చతుర్థీ వ్రతాన్ని ఆచరించడం వలన కష్టములు తొలగి అభీష్టం నెరవేరుతుంది.

**28.09.2021 – మంగళవారం – వ్యతీపాత మహాలయం**

మహాలయపక్షంలో పితృదేవతలకై చేయాల్సిన విధులలో వ్యతీపాతయోగం కలిసిన ఈ రోజు చెయ్యడం చాలా విశేషంగా పితృదేవతల అనుగ్రహాన్ని కలుగజేస్తుంది.

**29.09.2021 – బుధవారం – బుధాష్టమి, ఆర్ద్రాష్టమి**

బుధవారం–అష్టమి కలిసిరావడం అలభ్యయోగంగా శాస్త్రంలో చెప్పబడింది. ఈ రోజున ఆచరించే స్నాన, దాన, జప, హోమ పూజాదులేవైనా అనంత ఫలితాలను కలుగజేస్తాయి.

**30.09.2021 – గురువారం – అవిధవ నవమి**

పితృపక్షమైన మహాలయంలో వచ్చే నవమి తిథినాడు సుమంగళిగా గతించినవారికి ప్రత్యేకంగా శ్రాద్ధం చెయ్యడమనేది శాస్త్రంలో ఉంది. ఈ విధానం ఉత్తరాదిలో ఎక్కువగా వాడుకలో ఉంది. కొన్ని ప్రాంతాలలో ఈ రోజున ముత్తైదువును పిలిచి గతించిన సుమంగళిని తలచుకుని, ఆమెకు వస్త్రాదులిచ్చి భోజనం పెట్టడం కూడా చేస్తారు.